
సాక్షి
బాపట్ల
మంగళవారం । 10 । జూన్ । 2025



హుండీ ఆదాయం రూ.1.15 కోట్లు

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలోని హుండీల్లో రూ.1.15 కోట్లకు పైగా నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో భక్తులు సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 511.90 అడుగుల వద్ద ఉంది. ఇది 134.9183 టీఎంసీలకు సమానం.



ఆలయ భద్రతపై అలసత్వం వద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆలయ భద్రతకు సంబంధించి అలసత్వంగా ఉండవద్దని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఈవో సోమవారం తనిఖీ చేశారు.

కుంచించుకుపోయిన కుందేరు

చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో విస్తరించివున్న కుందేరు డ్రెయిన్‌ను పచ్చనేతలు కబ్జా చేశారు. ఆక్రమిత స్థలాల్లో ఏకంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. కొందరు బడా బాబులు కబ్జా స్థలాల్లో పరిశ్రమలు ఏర్పాటుచేయగా మరికొందరు సొంతంగా రొయ్యల చెరువులు సాగుచేశారు. ఇంకొందరు చెరువులు తవ్వి వేరొకరికి లీజుకు ఇచ్చి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. సుమారు 600 ఎకరాలు కబ్జాకు గురైనట్లు సమాచారం. చీరాల, వేటపాలెం, చినగంజాం ప్రాంతాలకు చెందిన కొందరు రెవెన్యూ అధికారులు కుందేరు స్థలాలలను అక్రమార్కులకు అప్పగించి ప్రతిఫలంగా పెద్ద ఎత్తున ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులకు సైతం ఇందులో వాటాలు ముడుతున్నట్లు సమాచారం.

పచ్చనేతల కబ్జా పర్వం

- చీరాల నుంచి చినగంజాం వరకు కుందేరు
- మూడు మండలాల పరిధిలో 1376 ఎకరాల్లో విస్తరణ
- వర్షపు నీరును సముద్రంలోకి తరలించే సాధనం
- చీరాల పట్టణం మురుగు తరలింపునకు ఇదే దారి
- ఇప్పటికే కుందేరులో 600 ఎకరాలు కబ్జా
- ఆక్రమణ స్థలాల్లో ఇంటి నిర్మాణాలు, పరిశ్రమలు, రొయ్యల చెరువులు ఏర్పాటు
- కబ్జా స్థలాల విలువ రూ.1000 కోట్లకు పైనే ఉంటుందని అంచనా
- ఇప్పటికీ ఆగని పచ్చనేతల కబ్జా పర్వం
- వాటాలు పుచ్చుకొని స్థలాలు అప్పగిస్తున్న అధికారులు
- ఉన్నతాధికారులకు ముడుపులు



నాడు కుందేరు ప్రధాన కాలువ



నేడు ఆక్రమణలతో కుంచించుకుపోయిన కుందేరు కాలువ

సాక్షి ప్రతినిధి,బాపట్ల: చీరాల మండలం ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద నుంచి చీరాల పట్టణం నుంచి వేటపాలెం మీదుగా పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలం పల్లెపాలెం వరకూ కుందేరు ప్రధాన కాలువ దాదాపు 1400 ఎకరాల్లో విస్తరించి వుంది. పల్లెపాలెం వద్ద ఈ కాలువ సముద్రంలో కలుస్తుంది. దశాబ్దాల కిందట నుంచి ఉన్న ఈ కాలువ ఇప్పుడు కొందరు పచ్చనేతల కబ్జాలతో పూర్తిగా కుంచించుకుపోయింది. కొన్నిచోట్ల మాత్రమే వెడల్పుగా ఉన్న కాలువ చాలాచోట్ల చిన్న పిల్లకాలువగా మారగా మరికొన్ని చోట్ల ఆనవాళ్లు కూడా కనిపించనంతగా మారిపోయింది.

రెవెన్యూ అధికారుల అండతో కబ్జా

కుందేరు ప్రధాన కాలువ భూముల కబ్జాలో కొందరు రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలున్నాయి. కుందేరు పేరుకు డ్రెయినేజీ విభాగం పరిధిలో ఉన్నా ప్రధాన కాలువ వెడల్పు ఎంతవరకు ఉందన్న దానిపై ఆ విభాగం వారికి స్పష్టత లేదు. దీంతో వారు ఈ భూముల సంగతి పట్టించుకోలేదు. ఈ వ్యవహారం దాదాపుగా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో ఉండిపోయింది. ఇదే అవకాశంగా రెవెన్యూ అధికారులు కుందేరు భూములను పచ్చ అక్రమార్కులకు అప్పగించి వాటాలు పంచుకున్నట్లు సమాచారం. ఎకరం రూ.3 నుంచి 5 కోట్ల వరకూ అమ్ముడు పోతుండడంతో కబ్జాదారులకు కుందేరు భూములు బంగారంగా మారాయి. ముడుపులు పుచ్చుకొని అధికారులు వారికి భూములు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈపూరుపాలెం, చీరాల పరిధిలో డ్రైనేజీవారితోపాటు రెవెన్యూ, మున్సిపల్ విభాగం అధికారులు కుందేరు భూముల కబ్జాలో పాలుపంచుకోగా వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలోని భూములను అధికంగా రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో కలిసి కబ్జాచేసి అమ్మకానికి పెట్టినట్లు సమాచారం. వేటపాలెం, చినగంజాం మండలాల్లో రెవెన్యూ అధికారిగా పనిచేసిన ఒక అధికారి కుందేరు భూముల కబ్జాలో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలున్నాయి. స్థానిక పచ్చ నేతలతోపాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంతో సత్సంబంధాలు పెట్టుకున్న రెవెన్యూ అధికారి కుందేరు భూములను విక్రయించడంలో కీలక భూమిక పోషించినట్లు అధికార వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆ అధికారి సముద్ర తీరప్రాంత భూములను పచ్చనేతలకు కట్టబెట్టి కోట్లు దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తీర ప్రాంతంలోని అసైన్డ్ భూములను కొందరు రిసార్ట్‌ల యజమానులతో పాటు అక్కడి పచ్చనేతలకు అప్పగిస్తున్నట్లు అధికార వర్గాల్లో ప్రచారంవుంది. రోజురోజుకూ విలువ పెరుగుతున్న తీరం భూములను కొట్టేసేందుకు ఇక్కడి పచ్చనేత సదరు రెవెన్యూ అధికారిని ఈ ప్రాంతానికి బదిలీ చేయించినట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుందేరుతోపాటు ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వేటపాలెం మండలం రామన్న పేట ప్రాంతంలో కుందేరు కాలువ పూడ్చి అక్రమ నిర్మాణాలు



రామన్నపేట ప్రాంతంలో కుందేరు కాలువ పూడ్చి రొయ్యల చెరువులు తవ్విన దృశ్యం

కుందేరు కబ్జాపర్వం ఇలా...

ఈపూరుపాలెం నుంచి చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల మీదుగా విస్తరించి వున్న కుందేరు ప్రధానంగా ఈపూరుపాలెం, పేరాల, కొత్తపేట ప్రాంతాల్లో ఆక్రమణకు గురైంది. కబ్జా చేసిన స్థలాల్లో పచ్చ ఆక్రమణదారులు వెంచర్లు వేసి అమ్మగా కొందరు కబ్జాచేసి గృహాలు నిర్మించుకున్నారు. కొందరు బడాబాబులు తమకున్న పట్టా స్థలాల్లో కుందేరు స్థలాన్ని కలిపేసుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇంకొందరు ఏకంగా ఆక్రమిత స్థలాల్లో పరిశ్రమలు స్థాపించారు. కొందరు పచ్చనేతలు కబ్జాచేసిన కుందేరు స్థలాలను వేరొకరికి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. చాలా మంది పోటీపడి మరీ కుందేరు స్థలాలను ఆక్రమించడంతో ఈ ప్రాంతాల్లో కుందేరు పూర్తిగా కనుమరుగై పోయింది. ఇక నాయనిపల్లి, పల్లరిపాలెం, పందిళ్లపల్లి, మోటుపల్లి ప్రాంతాల్లో ఉన్న కుందేరు భూములను అక్రమార్కులు కబ్జాచేసి ఏకంగా రొయ్యల చెరువులు సాగు చేశారు. కొందరు సొంతంగా రొయ్యల చెరువులు వేయగా మరికొందరు చెరువులు తవ్వి వేరొకరికి లీజుకు ఇచ్చి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. మరికొందరు కబ్జా చేసిన భూములను ఏకంగా అమ్మకానికి పెట్టి కోట్లు దండుకున్నారు. పర్యవసానంగా కుందేరు ప్రధానకాలువ దాదాపుగా కరుమరుగై పోయింది. కొన్ని ప్రాంతాల్లో చిన్న పిల్ల కాలువగా మారింది. కొన్ని చోట్ల చెరువులుగా రూపాంతరం చెందగా మరికొన్ని ప్రాంత్లాల్లో కాలనీలుగా మారింది. మొత్తంగా ఒకప్పుడు విశాలంగా ఉండి వర్షపునీరు, వరదనీరు, మురుగునీటిని సముద్రంలోకి చేర్చిన కుందేరు కబ్జా రాయుళ్ల పుణ్యమా అని ఇప్పుడు కుంచించుకపోయి దాదాపు కనుమరుగైపోయింది.

న్యూస్‌రీల్

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ వెంకటమురళి



బాపట్లటౌన్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి అన్నారు. రథం బజారులో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అందరి జీవితాల్లో యోగాసనాలు భాగం కావాలన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే యోగా సాధన ప్రతి ఒక్కరికి తప్పనిసరన్నారు. యోగా సాధనతోపాటు మానసిక ఆనందాన్ని పొంద వచ్చన్నారు. యోగా పూర్వీకులు మనకు ఇచ్చిన సంపదన్నారు. 2047 నాటికి ఆరోగ్యాకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన రాష్ట్రంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సూర్యలంక బీచ్ ఆవరణలో 5 వేల మందితో యోగసనాలు వేయిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. అనంతరం యువతీ, యువకులు చేసిన యోగాసనాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మున్సిపల్ కమిషనర్, యువకులు పాల్గొన్నారు.

మహా పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగింపు



నగరంపాలెం: స్థానిక కృష్ణనగర్ ఒకటో వీధిలో గల గోదా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఐదు రోజులుగా నిర్వహిస్తోన్న 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, నిత్య పూజలతో ప్రారంభమవ్వగా, అర్చక బృందం వేద మంత్రాలతో సుదర్శన మూలమంత్ర హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల అప్పగింతలు, వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలు చేపట్టారు. శ్రీవారికి తిరుప్పావడ సేవ అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ధ్వజావరోహణం, గరుడ ప్రసాద వితరణ, ద్వాదశ ప్రదక్షిణాలు, రుత్విక్ సన్మానం, వేదాశీర్వాదం, తీర్థప్రసాద గోష్ఠితో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు, ధనకుదరం వెంకట సత్యవైభవ్ పర్యవేక్షించారు.

సీఎం సభా వేదిక ఏర్పాట్లు పరిశీలన



తాడికొండ: తుళ్లూరు మండలం వెలగపూడిలో ఈనెల 12న సుపరిపాలన – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో సభా ఏర్పాట్లను సోమవారం సాయంత్రం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ పర్యవేక్షించారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సభా వేదిక, ఇతర ఏర్పాట్లను అధికారులతో చర్చించి, ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రొటోకాల్ డైరెక్టర్ మోహనరావు, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మురళీ కృష్ణ, తహసీల్దారు సుజాత పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమై

భార్యపై పెట్రోలు పోసి నిప్పంటించిన భర్త

బాపట్లటౌన్: భార్యపై అనుమానంతో భర్త పెట్రోలు పోసి నిప్పంటించిన వైనం బాపట్ల మండలం జమ్ములపాలెంలో చోటుచేసుకుంది. జమ్ములపాలెం గ్రామానికి చెందిన దాసరి సుభాషిణి(30)కి అదే గ్రామానికి చెందిన హరీష్‌తో 12 సంవత్సరాల కిందట వివాహమైంది. ఈమెకు ఇద్దరు మగ పిల్లలు. అనుమానంతో భర్త హరీష్ సోమవారం ఆమె శరీరంపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. తీవ్ర గాయాలపాలైన సుభాషిణిని స్థానికులు చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. 80 శాతం కాలిపోయిన శరీరానికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. మార్గంమధ్యలో ఆమె మృతిచెందింది. ఈ మేరకు రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దేవుడి సన్నిధిలో నిలువు 'దోపిడీ'

అధ్యాత్మికత వెల్లివిరియాల్సిన ఆలయాల్లో అవినీతి తాండవిస్తోంది. భక్తుల నమ్మకాన్ని అడ్డుపెట్టుకుని దుకాణదారులు దోపిడీ చేస్తున్నారు. గుడిలో అడుగు పెట్టింది మొదలు చదివించుకోవాల్సిందే. దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన ఆలయ అధికారులు కూడా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో ఆలయాల నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టించుకోవాల్సిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

- జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో దుకాణదారుల దందా
- పూజ సామగ్రి అధిక ధరలకు అమ్మకం
- చోద్యం చూస్తున్న అధికారులు



పొంగలి వండుకునేందుకు పెట్టిన రేట్ల బోర్డు

పట్నంబజారు: పెదకాకానిలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో అవినీతి అడ్డూ అదుపు లేకుండా పోయింది. భక్తులకు సిబ్బంది కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. కొద్ది రోజుల కిందట గుంటూరుకు చెందిన ఒక కుటుంబం ఆలయానికి వచ్చింది. రూ. 400తో అభిషేకం టికెట్ కొనుగోలు చేసింది. ఈ క్రమంలో పూజ సామగ్రి కిట్ కొనుగోలుకు వెళ్లింది. రూ. 300 అని చెప్పడంతో కంగుతిన్నారు. చిన్న సైజు రెండు కొబ్బరికాయలు, నాలుగు గులాబి పువ్వులు, ఐదు రూపాయలు విలువ చేసే సాంబ్రాణి కడ్డీల ప్యాకెట్, పది రూపాయల పాల ప్యాకెట్ ఉన్న కిట్టుకు రూ. 300 వసూలు చేయడంతో భక్తులు ప్రశ్నించారు. ఇష్టముంటే కొనుక్కో...లేకపోతే లేదంటూ దుకాణదారుడు మండిపడ్డాడు. కనీసం ఆలయంలో కూడా రేట్ల పట్టిక బోర్డులు లేకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు.

పొంగలికి విచిత్రమైన రేట్లు

పొంగలి విషయంలోనూ వ్యాపారులకు వత్తాసుగా ఆలయ అధికారులు వ్యవహరిస్తున్నారు. తడి బియ్యం అర కిలో లోపు రూ. 70, కిలో లోపు రూ. 100, కిలో దాటి రూ. 150 అంటూ.. విచిత్ర రేట్లు ఫిక్స్ చేశారు. గ్యాస్ సిలిండర్, స్టౌ, పలు సామాన్లు అందించాల్సిన కాంట్రాక్టర్ కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు.

అధికార పార్టీ వ్యక్తి హల్‌చల్

తీరా టికెట్ కొనుగోలు చేసి వెళితే క్యూలైన్ దగ్గర ఉండే ఒక వ్యక్తి "అడపా" దడపా "లక్ష్మణ" రేఖ గీస్తుంటాడు. ఆలయంలో అంత తాను చెప్పిన విధంగానే జరగాలంటూ.. అధికార పార్టీకి చెందిన వ్యక్తినంటూ హల్‌చల్ సృష్టిస్తున్నాడు. అభిషేకాలు, ప్రత్యేక దర్శనాలకు సంబంధించి కొంత మంది సిబ్బంది నేరుగా డబ్బులు వారి జేబుల్లో వేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది మద్యం తాగి అర్ధరాత్రులు విధుల్లోకి వస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆలయ అర్చకులు, సిబ్బంది కైంకర్యం

- పొన్నూరు ఆంజనేయస్వామి దేవస్థానంలో సైతం ఇదే పరిస్థితి నెలకొని ఉంది. దేవదాయ శాఖకు చెందాల్సిన సొమ్మును ఆలయ అర్చకులు, సిబ్బంది కలిసి కైంకర్యం చేస్తున్నారు. నేరుగా అర్చకుడి వద్దకు వచ్చి ఇవ్వాళ్ల టోకెన్ల వాటా ఏదీ అంటూ.. భక్తుల ముందే అటెండర్లు తీసుకుని వెళ్తున్న పరిస్థితి కనపడుతోంది. భక్తులు క్యూలో నిలబడి ఉన్న సమయంలో అర్చకులు వారి డబ్బులు లెక్క వేసుకుని, అటెండర్లకు ఇచ్చే పని తప్పా భక్తులను పట్టించుకోకపోవడం దారుణం. టికెట్ కొనుగోలు చేసి వచ్చిన వారికి కనీసం గోత్ర, నామాలు కూడా చెప్పకుండా, అటెండర్లు తీసుకునివచ్చిన వారికి, అర్చకులు విజిటింగ్ కార్డులు ఇచ్చి పిలిపించుకున్న వారికి మాత్రమే అధిక ప్రాధాన్యం లభిస్తోంది.
- గుంటూరు వేంకటేశ్వరస్వామి ఆలయం, మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కంఠంరాజు కొండూరు, వైకుంఠపురంతో పాటు అనేక ప్రధాన ఆలయాల్లో వేలం పాటల్లో దుకాణాలు దక్కించుకున్న వారు కనీసం రేట్ల పట్టికలు కూడా పెట్టడం లేదు. ఇష్టానుసారంగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల ఉన్న పరిస్థితిని బట్టి రూ. 100 నుంచి రూ. 300పైగానే పూజా కిట్లను అమ్ముతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆలయంలో జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా సిబ్బంది నిబంధనలకు లోబడే విధులు నిర్వర్తించాలి. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక విజిలెన్స్ సిబ్బందిని ఏర్పాటు చేసి, షాపులు, పొంగలి షెడ్లలో అధిక రేట్లు వసూళ్లకు పాల్పడకుండా చర్యలు చేపడతాం.

– లీలాకుమార్, కాకాని శివాలయం, కార్యనిర్వాహణధికారి

'కలం' ఎత్తిన సాక్షి ఉద్యోగులు



జిల్లావ్యాప్తంగా సాక్షి కార్యాలయాలు, యూనిట్ ఆఫీస్‌లపై దాడులు చేస్తున్న తెలుగుదేశం పార్టీ మహిళలు, రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సాక్షి ప్రతినిధులు గుంటూరులో స్పెషల్ బ్రాంచ్ సీఐ అళహరి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. సాక్షి దినపత్రిక, సాక్షి టీవీ కార్యాలయాలపై దాడులు జరగకుండా భద్రత కల్పించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల దౌర్జన్యాన్ని ఖండిస్తూ మంగళగిరిలోని సాక్షి కార్యాలయం ఉద్యోగులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నేతల దురాగతాన్ని ఖండించారు. – లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్)

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం చెందిన సంఘటన పట్టణంలోని పోతురాజు గండి సమీపంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో సోమవారం జరిగింది. అందిన సమాచారం మేరకు బల్లికురవ మండలం కొప్పరపాడు గ్రామానికి చెందిన చిన్న సైదులు ఏడాది క్రితం మృతి చెందాడు. కుమార్తెకు వివాహం చేసి అత్తవారింటికి పంపారు. కుమారుడు రాజేశ్ (15) తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ ఏడాది పదో తరగతిలో చేరడానికి సిద్ధమవుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో అద్దంకిలోని భవానీ సెంటర్‌లో ఉన్న తన మేనత్త దగ్గరకు వచ్చి ఉంటున్నాడు. ఈ క్రమంలో బైకుపై బజారుకు రాగా పోతురాజు గండి సమీపంలో లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బరాజు అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతితో అతని స్వగ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. కుమారుని మృతితో తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

11న ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ 11వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజామున 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు

బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి అన్నారు. పట్టణంలోని సాయిరాం గార్డెన్స్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం షైనింగ్ స్టార్ 2025 అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యలో అత్యధిక మార్కులు సాధించిన జిల్లా, మండల స్థాయిలోని విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించారు. పదో తరగతిలో 164 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో 36 మంది విద్యార్థులను అధికారులు సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ అమూల్యమైన విద్యార్థి జీవితం చెడు వ్యసనాలతో పెడదోవపట్టరాదన్నారు. భావి జీవితంలో ఉన్నత స్థానాలను అలంకరించే స్థాయికి ఎదగాలన్నారు. నేటి సమాజానికి దిక్సూచిలా మారాలని, ఆత్మాభిమానంతో ముందుకు వెళ్లాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని విద్యార్థులు గుర్తించాలి, క్రమశిక్షణతో కష్టపడి చదివితే మీ భవిష్యత్తును మీరే నిర్మించుకోవచ్చన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి చెడు వ్యసనాలతో ప్రలోభాలకు దరికావద్దన్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఇష్టంతో కష్టపడి చదవండి, మీకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను నిర్వహించడానికి ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళుతుందన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ ప్రతిభావంతులను వెలికి తీసి, సమాజం కోసం ప్రయోజకులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి గ్లోరియా, డీఈవో పురుషోత్తమ్, ఆర్ఐఓ ఆంజనేయులు, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి

క్లుప్తంగా

విద్యుదాఘాతంలో యువకుడి మృతి

సంతమాగులూరు (అద్దంకి): విద్యుదాఘాతానికి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని అడవిపాలెం పవర్ ప్లాంటు వద్ద సోమవారం జరిగింది. ప్రమాదంలో ఏల్చూరు గ్రామానికి చెందిన జూటూరు కొండ గురవయ్య తొలుత గాయలపాలయ్యాడు. క్షతగాత్రుడిని బంధువులు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. గురవయ్య అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

రెంటచింతల: గ్రామాల్లో ఎవరైన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున హెచ్చరించారు. సోమవారం విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక బైపాస్ రహదారిలోని ఓ లాడ్జిలో పేకాటాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ. 67,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నివారణలో పోలీసు సిబ్బందితో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎస్‌ఐ కోరారు.

టీడీపీ, జనసేన నేతల బాహాబాహీ

సత్తెనపల్లి: ఆధిపత్య పోరులో భాగంగా సత్తెనపల్లి మండలం వెన్నాదేవిలో సోమవారం టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అచ్చంపేట మండలం ఓర్వకల్లులో ఓ శుభ కార్యక్రమానికి టీడీపీకి చెందిన కిలారి వేణు, జనసేనకు చెందిన రాట్నాల నాగరాజు ఆదివారం హాజరయ్యారు. అక్కడ వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. అంతటితో ఆగకుండా ఇరు వర్గాలవారు సోమవారం గ్రామంలో ఘర్షణకు దిగారు. ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనే అవకాశం ఉండడంతో సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని హెచ్చరికలు చేసి పంపారు. ఈ విషయం స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి రావడంతో కేసు కట్టాల్సిందిగా సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సూచించారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: చదువులో ప్రతిభ చూపి, ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునేందుకు స్థిరమైన లక్ష్యంతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల నుంచి టెన్త్, ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 150 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా పురస్కారాలు అందించారు. పొన్నూరు రోడ్డులోని బీ కన్వెన్షన్ హాల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడారు. పాఠశాల విద్యలో మండలాల వారీగా ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి టెన్త్‌లో 112 మంది, ఇంటర్మీడియెట్‌లో 38 మంది చొప్పున 150 మంది విద్యార్థినీ, విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికీ రూ.20 వేలు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందిస్తున్నట్లు వివరించారు. మండలానికి ఆరుగురు చొప్పున టెన్త్‌లో 600 మార్కులకు 500కు పైబడిన విద్యార్థులతో పాటు ఇంటర్మీడియెట్‌లో 830కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేశామని తెలిపారు. షైనింగ్ స్టార్ అవార్డులు పొందిన విద్యార్థులతో పాటు కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రైవేటు రంగానికి మించి ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, పాఠశాల విద్య, ఇంటర్ విద్య ఆర్జేడీలు లింగేశ్వరరెడ్డి, జె.పద్మ, డీఈవో సీవీ రేణుక, ఆర్‌ఐవో జీకే జుబేర్, ప్రభుత్వ పరీక్షల విభాగ సహాయ కమిషనర్ కె.వెంకటరెడ్డి, డీసీఈబీ కార్యదర్శి ఏ. తిరుమలేష్, సమగ్ర శిక్ష ఏపీసీ పద్మావతి, డీవైఈవోలు సీహెచ్. ఏసురత్నం, నిర్మల కుమారి, ఎంఈవోలు పాల్గొన్నారు.

సీఎం, లోకేష్‌లపై పొగడ్తలు

ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో విద్యాశాఖాధికారులు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను తెగ పొగిడించారు. రాష్ట్రంలో విద్యారంగం కొత్తగా ఏడాది వ్యవధిలోనే అభివృద్ధి చెందినట్లు, వీరిద్దరే కారకులన్నట్లుగా పొగడ్తలతో ముంచెత్తడం తల్లిదండ్రులను విస్మయానికి గురి చేసింది.

ప్రైవేటు విద్యార్థులే అధికం

జిల్లాలో షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపిక చేసిన 150 మంది విద్యార్థుల్లో 116 మంది ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిన వారే ఉన్నారు. ప్రభుత్వ రంగంలో చదివిన పేద కుటుంబాలకు చెందిన కేవలం 34 మందిని మాత్రమే ఎంపిక చేసింది. ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం, విద్యాశాఖ ప్రైవేటు, కార్పొరేట్‌కే పట్టం కట్టింది. అవార్డులు అందుకున్న 112 మంది టెన్త్ విద్యార్థుల్లో ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు 85 మంది ఉండగా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 27 మంది మాత్రమే ఉన్నారు. అదే విధంగా 38 మంది ఇంటర్ విద్యార్థుల్లో 31 మంది ప్రైవేటు, ఏడుగురు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉన్నారు.

మూడు బైకులు ఢీ

- ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం
- పలువురికి గాయాలు


మోహన కృష్ణ మృతదేహం

రాజంపేట: కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని రాజంపేట గుండ్లూరు క్రాస్ రోడ్డులో మూడు బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బోయనపల్లిలో ఇంజినీరింగ్ చదువుతున్న గుంటూరుకు చెందిన మోహనకృష్ణ(20) మృతి చెందాడు. రామాపురానికి చెందిన ఇద్దరు, చొప్పావారిపల్లికి చెందిన ఇద్దరు, సమీప తోటలో పనిచేసే మరో వ్యక్తి గాయపడ్డారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మన్నూరు పోలీసులు తెలిపారు.

ఏపీ ఈఏపీసెట్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, డీన్లు, ప్రిన్సిపాల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గా ప్రసాద్ తెలిపారు. లక్ష్మీపురంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల వారీగా వి. రూపశ్రీ (40)వ ర్యాంకు, ఎన్. రక్షిత్ ఇన్నా (72), షేక్ నిహాల్ పర్వేజ్ (74), ఓ. సుష్మ కౌస్తుభరాణి (96), జి. శ్రీలేఖ (110), ఎండీ గబీష్ ఐమన్ (298)వ ర్యాంకు సాధించారని తెలిపారు. వెయ్యిలోపు (96), రెండువేల లోపు (147), ఐదువేల లోపు (358) ర్యాంకులతో పాటు 10వేల లోపు (763) ర్యాంకులు సాధించామని చెప్పారు. ఆయా ర్యాంకులతో 98 శాతం మంది విద్యార్థులు ఈఏపీ సెట్‌లో అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా డీన్లు కిశోర్, సురేష్, చంద్రశేఖర్, కృష్ణ, ఏజీఎం ఎల్‌టీసీ శ్రీనివాస్, అన్ని క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్, ర్యాంకర్లకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.

కౌలు రైతులకూ 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

లక్ష్మీపురం: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలని, భూ యజమాని సంతకం తొలిగించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతుల సమస్యలపై ఈనెల 11న నిర్వహిస్తున్న 'చలో మంగళగిరి'ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.
ఎన్నికల ముందు కూటమి నేతలు పాత కౌలు చట్టాన్ని రద్దు చేస్తామని, భూ యజమాని సంతకం తొలగించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడానికి కొత్త చట్టం తీసుకొస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ కిందట రూ. 20 వేలు ప్రతి కౌలు రైతుకు ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా పథ కాలు ఊసే లేదని విమర్శించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణ, సహాయ కార్యదర్శి పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పాల్గొన్నారు.

జిల్లా ఏడీఎంగా సత్యనారాయణ చౌదరి

కొరిటిపాడు: గుంటూరు జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులుగా అనంతపురం జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న సత్యనారాయణ చౌదరి నియమితులయ్యారు. ఆయన ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన బదిలీల ప్రక్రియలో భాగంగా గుంటూరు జిల్లా ఏడీఎంగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న బి.రాజబాబు తిరువూరు మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శిగా నియమితులయ్యారు. మరో రెండు రోజుల్లో ఏడీఎంగా సత్యనారాయణ చౌదరి బాధ్యతలు స్వీకరించనున్నారు.

చదరంగంతో పెరగనున్న మేధాశక్తి



విజేతలతో లక్ష్మీనారాయణ, రామచంద్రరాజు, గోపి

గుంటూరు ఎడ్యుకేషన్: భారత దేశంలో పురాతన ఆటగా మొదలైన చదరంగం అంతర్జాతీయ స్థాయిలో నేడు ప్రముఖ క్రీడగా గుర్తింపు పొందిందని గుంటూరు జిల్లా ఇన్‌టాక్ కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో సోమవారం జిల్లా స్థాయి చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బాలబాలికలకు చిన్న వయసు నుంచే చదరంగంలో మెళకువలను నేర్పాలని తెలిపారు. ఆట ద్వారా వ్యూహాత్మక ఎత్తుగడల నైపుణ్యత, మేధో పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం ఏర్పడి ఉన్నత స్థాయి వ్యక్తులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుందని వివరించారు. భారతీయ విద్యాభవన్స్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ భవన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీల్లో జిల్లావ్యాప్తంగా 150 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి కేతరాజు సుభాష్, ప్రిన్సిపాల్ హేమాంబ, ఆనంద్ చెస్ అకాడమీ నిర్వాహకుడు గోపి పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం

- మాన్యువల్ కౌన్సెలింగ్ కోసం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పట్టు
- నిరాహార దీక్ష చేపట్టిన సంఘాల నాయకులు


శిబిరంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: సెకండరీ గ్రేడ్ టీచర్ బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మాన్యువల్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ఆందోళనను ఉధృతం చేశారు. ఉమ్మడి గుంటూరుజిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నాయకులు, ఉపాధ్యాయులు నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ఉమ్మడి గుంటూరు జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖాధికారులు మోసపూరితంగా వెబ్ ఆప్షన్లకు దిగారన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడాన్ని నిరసిస్తూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా డీఈవో కార్యాలయాల ముట్టడి ద్వారా ప్రభుత్వానికి నిరసన తెలియజేసినప్పటికీ, ప్రభుత్వంలో చలనం రాలేదని విమర్శించారు. పుండుమీద కారం చల్లినట్లు విద్యాశాఖా మంత్రి లోకేష్ మాన్యువల్ కౌన్సెలింగ్‌కు చట్టం అడ్డం వస్తుందని చెప్పడం, నమ్మిన ఉపాధ్యాయులను మోసం చేయడమేనని తెలిపారు. జీఓ117 రద్దు, తెలుగు మాధ్యమ పునరుద్ధరణ, పని ఒత్తిడ తగ్గింపుపై ఇచ్చిన మూడు హామీలు అమలు చేయకుండా మోసగించారని ఆరోపించారు. ఐక్యవేదిక నాయకులు ఎం.కళాధర్, డి.పెదబాబు, జీవీ రామకృష్ణ , సోషలిజం మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ వద్దని ఒక పక్క ఉద్యమం చేస్తుంటే మరొక పక్క డీఈఓ, ఎంఈవో కార్యాలయాల నుంచి ఉపాధ్యాయులకు ఫోన్లు చేస్తూ వెబ్‌ఆప్షన్స్ ఇచ్చుకోవాలాని బెదిరింపులకు దిగడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్స్ అనుభవం లేని మహిళా ఉపాధ్యాయులను ఏడిపించడం ఈ ప్రభుత్వానికి, మంత్రికి మంచిది కాదని హితవు పలికారు. వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవద్దని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. నిరాహార దీక్ష శిబిరాన్ని సీనియర్ మహిళా నాయకురాలు కుసుకుమారి ప్రారంభించారు. శిబిరంలో ఐక్యవేదిక నాయకులు ఎం.హనుమంతరావు, ఎస్. రామచంద్రయ్య, మహమ్మద్ ఖాలీద్, డీకే సుబ్బారెడ్డి, వినయ్, సంపత్, షకీలా బేగం, జి.దాస్, కె.కృష్ణారావు, సుభాని, ప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులతో కూటమి ప్రభుత్వం బంతాట



తాడేపల్లి రూరల్ : కృష్ణాజిల్లా ఈడుపుగల్లులోని అంబేడ్కర్ ఐఐటీ నీట్ మహిళా అకాడమీ(గురుకుల పాఠశాల)ని మైలవరానికి తరలించ వద్దంటూ విద్యార్థినులు సోమవారం తాడేపల్లిలోని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ నిధులతో నీట్, ఐఐటీ శిక్షణకు అద్దె భవనాలలో అకాడమీని స్థాపించారని తెలిపారు. 2014–15, 2015–16 సంవత్సరాల్లో శిక్షణకు గాను సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 100 మంది విద్యార్థులను ఎంపిక చేసుకుని, ఒక్కొక్కరికీ రూ. 75 వేలు ఫీజుగా చెల్లించి కార్పొరేట్ కళాశాలల్లో చేర్చే వారని తెలిపారు. దీంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలం కావడంతో ర్యాంకులు సాధించే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చీఫ్ సెక్రటరీ రావత్, సెక్రటరీ రాములు, చైర్మన్, అధికారులు బోర్డు మీటింగ్ నిర్వహించి విద్యార్థులకు కార్పొరేట్ విద్యకు దీటుగా ఐఐటి, నీట్ అకాడమీలు స్థాపించడానికి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో ఈడుపుగల్లులో అంబేడ్కర్ ఐఐటీ నీట్ మహిళా అకాడమీ ఏర్పాటు చేశారని వివరించారు. అధికారులు అలసత్వం వహించి విద్యార్థుల సంఖ్యను తగ్గించడం, నిర్ణీత సమయానికి అడ్మిషన్లు ఇవ్వకపోవడంతో ఆశయం పూర్తిగా నెరవేరలేదని విమర్శించారు. ఈ స్థితిలో విద్యార్థులు, భావితరం వారి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఈడుపుగల్లు నుంచి విద్యార్థులను తరలించే కార్యక్రమాన్ని నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.


పత్రికా కార్యాలయాలపై దాడి హేయమైన చర్య

- బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ సంఘం సభ్యులు
- పట్టణ సీఐకు వినతిపత్రం అందజేత


పట్టణ సీఐ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ సంఘం సభ్యులు

బాపట్లటౌన్: పత్రికల్లో వార్తలు ప్రచురించారనే అక్కసుతో పత్రికా కార్యాలయాలపై దాడులు చేయటం హేయమైన చర్యని బాపట్ల జర్నలిస్ట్ అసోసియేషన్ గౌరవ సలహాదారుడు ఉప్పాల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాక్షి కార్యాలయాలపై జరిగిన దాడికి నిరసనగా బాపట్ల జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ సీఐకు వినతిపత్రం అందజేశారు. ఉప్పాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పత్రికా కార్యాలయాల గేట్లు ధ్వంసం చేయటం, కార్యాలయాలపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేయటం, సాక్షి నేమ్ బోర్డులు ధ్వంసం చేసి తగలపెట్టడం సమంజసం కాదన్నారు. దీనికి కారణమైన వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు బిజివేముల రమణారెడ్డి, జి.రాఘవేంద్రరావు, మురికిపూడి అంజయ్య, అంగిరేకుల కోటేశ్వరరావు, శీలం సాగర్, తోటకృష్ణమూర్తి, షేక్ మస్తాన్ వలి, చిన్నం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


రాజేష్ మృతదేహం

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణంలోని పోతురాజు గండి సమీపంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..బల్లికురవ మండలంలోని కొప్పరపాడు గ్రామానికి చెందిన చిన్న సైదులు కుమారుడు రాజేష్(15) స్వగ్రామం నుంచి బైకుపై అద్దంకి వచ్చాడు. ఈ క్రమంలో బైకు ముందు వెళ్తున్న లారీ పక్కగా నడుపుతున్న క్రమంలో టైరు కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బరాజు అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పోరాటాలతోనే హక్కుల పరిరక్షణ

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పెదబాబు


ఎస్టీయూ పతకానికి వందనం చేస్తున్న నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: నిరంతర పోరాటాలతోనే హక్కులను పరిరక్షించుకోగలమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు పేర్కొన్నారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్ వద్ద సోమవారం 79వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సమరంలో బానిస సంకెళ్లను బద్దలు కొట్టి, 1946 మే 1న ఎస్టీయూ ఆవిర్భవించిందని తెలిపారు. 1947 జూన్ 9వ తేదీ నుంచి అధికారిక గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం అని వివరించారు. ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం కలిగిన ఎస్టీయూ 78 ఏళ్లుగా నిరంతరం ఉద్యమ స్ఫూర్తితో ప్రగతి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు వివిధ సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వాలతో పోరాడి, సాధించడంలో విశేష కృషి చేసిందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉద్యమాలకు పుట్టినిల్లు ఎస్టీయూ అని చెప్పారు. సంఘ ఉద్యమ నేతలు మగ్దుం మొహిద్దీన్, పీవీ రాఘవాచారి, వీణా విజయ రామరాజు, పి. శ్రీరామమూర్తి వంటి నాయకుల త్యాగం మరువలేనిదని కొనియాడారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా పనిచేస్తూ సంఘ పురోభివృద్ధికి పాటుపడాలని పెదబాబు సూచించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ మొహబూబ్ సుభాని, నాయకులు పి. దిబ్బయ్య, వై. శ్యాంబాబు, యు. మహంకాళరావు, ఎంపీ సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయాన్ని స్వాధీనం చేసుకున్న దేవదాయ శాఖ అధికారులు


స్వామి ఆభరణాలను అధికారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీలక్ష్మి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని దేవదాయ శాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. స్వామి వారి రూ.9 కోట్లు విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలను ఈఓ వెంకటేశ్వరరావుకు ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ అందజేశారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, నల్లపాడు సీఐ వంశీధర్, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో వేణుగోపాల్ వాటిని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 22 సంవత్సరాల కిందట దేవాలయాన్ని ప్రతిష్ఠించామని, అప్పటి నుంచి విశేష పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ కొంత మంది పనిగట్టుకొని కావాలనే వేణుగోపాల్ పైన అభాండాలు వేయడం వల్ల దేవదాయ శాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన హయాంలోనే భక్తులు ఇచ్చిన కానుకలతో స్వామికి ఆభరణాలు చేయించారని చెప్పారు. లాకర్లో ఉన్న ఆభరణాలను తీసి అందరి సమక్షంలో ఆయన అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. గోరంట్లలో తొమ్మిది దేవాలయాలను నిర్మించిన వేణుగోపాల్ సేవలు ఇంకా కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు కంచర్ల ఆంజనేయులు, ఆల శివారెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, నాగేశ్వరరావు, మహేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.